సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 30 । జూన్ । 2023



ఉమ్మడి జిల్లాలో మరో నగ

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మరో వ్యవసాయ కళాశాల ఏర్పాటు కానుంది.పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారంలో రెండో వ్యవసాయ కళాశాలకు సీఎం కేసీఆర్ అంగీకారం తెలిపారు. 8లో▸



'బీసీ బంధు' అర్హులకు అందేనా?

బలహీన వర్గాలకు చెందిన కులవృత్తిదారులకు ప్రభుత్వం అందించనున్న రూ.లక్ష ఆర్థిక సాయం(బీసీ బంధు) పథకానికి దరఖాస్తులు వేలాదిగా వచ్చాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రంగనాయకస్వామి భూములు కాపాడండి



పూజలు చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం ముత్తారం, ధర్మబాదలోని శ్రీరంగనాయకస్వామి ఆలయానికి చెందిన వందలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని కాపాడాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ అన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ముత్తారంలోని రంగనాయకస్వామి ఆలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చిలారపు పర్వతాలు, మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్‌తో కలిసి పూజలు చేశారు. పురాతన ఆలయానికి చెందిన భూములను కొందరు ఆక్రమించుకున్నారని, ఆలయంలో ధూపదీప నైవేద్యాలు నిర్వహించని పరిస్థితి నెలకొందన్నారు. ఆయన వెంట పార్టీ అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, నాయకులు తంగెడ రాజేశ్వరరావు, కౌన్సిలర్ రాజం మహంత, సంపత్‌రావు తదితరులు ఉన్నారు.

సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి



పాలు పంపిణీ చేస్తున్న పుట్ట మధు

మంథని: సామాజిక సేవలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా మంథని గోదావరి తీరంలోని గౌతమేశ్వర సన్నిధిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాల పంపిణీని గురువారం ప్రారంభించారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో బీపీ చెక్ చేయించుకున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, గౌతమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మేడగోని రాజమౌళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొలనూర్‌లో వందేభారత్ రైలు



కొలనూర్ రైల్వేస్టేషన్‌లో ఆగిన వందేభారత్

ఓదెల: సికింద్రాబాద్ నుంచి నాగపూర్ మధ్య నడవనున్న వందేభారత్ రైలు ట్రయల్‌రన్ ప్రారంభమైంది. సదరు రైలు గురువారం మధ్యాహ్నం మండలంలోని కొలనూర్ రైల్వేస్టేషన్‌లో కాసేపు ఆగింది. నాగపూర్ నుంచి మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి మీదుగా ట్రయల్ రన్ చేయగా.. కొలనూర్ రైల్వేస్టేషన్ వద్ద సిగ్నల్ దొరక్కపోవడంతో నిలిచిపోయింది. దీనిని ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు.

పాటలతో ప్రజల్ని చైతన్యపర్చిన సాయి



నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: అన్నివర్గాల ప్రజలను తన పాటలతో చైతన్యపర్చిన సాయిచంద్ మృతి తీరని లోటు అని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ మృతికి సంతాపంగా గురువారం రాత్రి తన నివాసం నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు కొవ్వత్తులతో ప్రదర్శన నిర్వహించారు. సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటే నడుస్తూ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, ఎంపీపీ కొండ శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, నాయకులు తగరం శంకర్‌లాల్ పాల్గొన్నారు.

మంథని వద్ద గోదావరిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



ఘనంగా ఏకాదశి



మంథనిలో పూజలు చేస్తున్న భక్తులు

మంథని/కమాన్‌పూర్: తొలి ఏకాదశిని జిల్లావ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మంథనిలోని గోదావరినదిలో పుణ్యస్నానాలు చేసి ఆలయాల్లో పూజలు చేశారు. సంగమేశ్వరస్వామి, గౌతమేశ్వరుడు, సురాబాండేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తుల రాకతో గోదావరి నది రద్దీగా మారింది. జెడ్పీ చైర్మన్ పుట్టమధు దంపతులు భక్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సీఐ సతీష్, ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కమాన్‌పూర్‌లోని ఆదివారాహ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.





జిల్లాకేంద్రంలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి





శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, ఈద్గా వద్ద ఎమ్మెల్యే చందర్

ఈద్ ముబారక్



రామగుండంలో ప్రార్థన చేస్తున్న మక్కాన్‌సింగ్

పెద్దపల్లిరూరల్/గోదావరిఖనిటౌన్/రామగుండం: బక్రీద్‌ను ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లాకేంద్రంలోని మజీదుల్లో ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దపల్లిలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు.. ఓసీపీ–5 సమీపంలోని ఈద్గా వద్ద రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, రామగుండంతోపాటు గోదావరిఖనిలోని పలు ప్రాంతాల్లో డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆగుతూ.. సాగుతూ..!

- పెద్దపల్లి – ఇందూరు రైల్వేకు 30 ఏళ్లు
- 1993లో శంకుస్థాపన చేసిన నాటి ప్రధాని పీవీ
- 24 ఏళ్లకు పూర్తయిన రైల్వేలైన్
- విద్యుద్దీకరణ పూర్తయినా సింగిల్ మార్గమే
- కొత్తపల్లి మనోహరాబాద్ పూర్తయితే మరిన్ని రైళ్లు
- భవిష్యత్ రైల్వే కేంద్రంగా కరీంనగర్



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 1993 జూన్ 30.. ఇదొక చారిత్రక విశిష్టత కలిగిన రోజు. రైలు కూత వినాలన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసుల కలకు ఆ రోజే బీజం పడింది. కరీంనగర్ ముద్దుబిడ్డ.. నాటి ప్రధాని పీవీ.నరసింహారావు పెద్దపల్లి–నిజామాబాద్ (ఇందూరు) రైల్వేమార్గానికి శంకుస్థాపన చేసి నేటికి 30 ఏళ్లు పూర్తయ్యాయి. 178 కిలోమీటర్ల దూరమున్న ఈ మార్గానికి పెద్దగా నిధులు కేటాయించకపోవడంతో పనులు నెమ్మదిగా సాగి 24ఏళ్లకు పూర్తయ్యింది. ముందుగా పనులు ప్రారంభించిన ఎనిమిదేళ్లకు కరీంనగర్ వరకు (35 కిలోమీటర్లు) 2001లో లైన్ అందుబాటులోకి వచ్చింది. తరువాత జగిత్యాల వరకు లైన్ కోసం ఆరేళ్లు పట్టింది. 2016 డిసెంబరు 19న జగిత్యాల (లింగంపేట) వరకు రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. 2015లో లింగంపేట–మోర్తాడ్–నిజామాబాద్ వరకు రైల్వే మార్గాన్ని సిద్ధం చేశారు. తొలుత డీజిల్ ఇంజిన్ల రైళ్ల ప్రయాణం సాగించిన ఈ మార్గం .. ప్రస్తుతం పూర్తిస్థాయిలో విద్యుదీకరణ చేశారు. 2017లో విద్యుదీకరణ జరిగినా.. నేటికీ సింగిల్ బ్రాడ్‌గేజ్ లైన్‌గానే మిగిలిపోయింది.

పాతవే తప్ప.. కొత్త రైళ్లేవీ..

ఇన్నేళ్ల రైల్వేలైన్ చరిత్రలో ఇక్కడ నుంచి చెప్పుకోదగ్గ రైళ్లేవీ ఇక్కడ నుంచి నడవలేదంటే అతిశయోక్తి కాదు. వీక్లీ స్పెషల్‌గా కాజీపేట నుంచి దాదార్ ఎక్స్‌ప్రెస్, నిజామాబాద్ నుంచి సిర్పూర్ టౌన్ మెము పుష్‌పుల్ ఎక్స్‌ప్రెస్, కాచిగూడ నుంచి కరీంనగర్ డెము ఎక్స్‌ప్రెస్ పుష్‌పుల్, కరీంనగర్ నుంచి తిరుపతి బైవీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. ఈ మార్గాల నుంచి సరుకు రవాణా ద్వారా దక్షిణ మధ్య రైల్వేకు అధిక ఆదాయం వస్తోంది. ఈ మార్గంలో ఉమ్మడి జిల్లా నుంచి గ్రానైట్, బొగ్గు, వ్యవసాయ ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతూనే ఉన్నాయి. గూడ్స్ రైళ్ల రద్దీ పెరగడంతో ఈ మార్గాన్ని రెండు వరుసలుగా విస్తరించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. దీనికి స్థానిక ఎంపీలు చొరవచూపి వచ్చే వర్షాకాల బడ్జెట్ సమావేశాల్లో డబుల్ మార్గంగా అప్‌గ్రేడ్ అయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

భవిష్యత్తులో కరీంనగర్ కీలక జంక్షన్

కరీంనగర్ రైల్వేపరంగా వ్యూహాత్మక ప్రాంతం. కొత్తపల్లి మనోహరాబాద్ హైదరాబాద్ డివిజన్‌లోకి వస్తుంది. అదే పెద్దపల్లి – నిజామాబాద్ రైల్వేలైన్ సికింద్రాబాద్ డివిజన్. ఈ రెంటినీ కలిపి ఉత్తర భారతానికి వెళ్లే రైళ్లకు కరీంనగర్ కేంద్రంగా మారనుంది. కొత్తపల్లి– మనోహరాబాద్ (151కి.మీ)తోపాటు, ఆర్మూర్– ఆదిలాబాద్ (128 కి.మీ) పూర్తయితే ఉత్తర–దక్షిణ తెలంగాణలకు కరీంనగర్ కేంద్రంగా నిలవనుంది. కరీంనగర్– హసన్‌పర్తి రైల్వేలైన్ పూర్తయితే మహారాష్ట్ర, గుజరాత్ మరింత దగ్గరవనున్నాయి.

అలా జరగాల్సి ఉండే..!

- మొదటగా పెద్దపల్లి నుంచి నిజామాబాద్ రైల్వేమార్గాన్ని హైదరాబాద్ సంస్థానంలోని చివరి రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1948లో పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మీదుగా నిర్మించాలని అనుకున్నారు. అయితే ఆయన సంస్థానం భారత్‌లో విలీనం కావడంతో ప్రతిపాదన అటకెక్కింది.
- ప్రధానిగా పీవీ బాధ్యతలు చేపట్టాక తాను పెరిగిన కరీంనగర్ జిల్లా కేంద్రానికి రైల్వేస్టేషన్ లేకపోవడంతో ఈ మార్గాన్ని వయా కరీంనగర్ మీదుగా నిర్మించాలని నిర్ణయించారు. శంకుస్థాపన సమయంలో ప్రస్తుత పెద్దపల్లి జిల్లాలోని మంథని నుంచి కొత్తగూడెం జిల్లా మణుగూరు వరకు విస్తరించాలని అనుకున్నారు. అయితే భారీగా అటవీ ప్రాంతం ఉండడం.. నక్సలైట్ల ప్రభావం.. గోదావరి నదిపై వంతెనల నిర్మాణం వంటివి అడ్డురావడంతో అనుమతి రాలేదు.

ప్రజల డిమాండ్లివే..

- కాజీపేట నుంచి నిజామాబాద్ వరకు పుష్‌పుల్ మెము ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి తెస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు ఎంతో ఉపయోగం.
- కరీంనగర్ నుంచి సికింద్రాబాద్ (వయా పెద్దపల్లి–కాజీపేట) మీదుగా మెము ఎక్స్‌ప్రెస్ నడపాలని గతంలో ప్రతిపాదనలు చేసినా అమలుకు నోచుకోవడం లేదు
- 07195/96 కాజీపేట నుంచి దాదార్ ముంబయి వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలుని రోజు నడపాలని ప్రజా ప్రతినిధులు కోరినా స్పందన లేదు



పెద్దపల్లి–నిజామాబాద్ రైల్వేలైన్ శిలాఫలకం



శంకుస్థాపన చేస్తున్న అప్పటి ప్రధాని పీవీ, అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి(ఫైల్)

బీజేపీ చేసిందేమీ లేదు



రైల్వేలైన్ శంకుస్థాపన నుంచి రైళ్ల కేటాయింపు వరకు కాంగ్రెస్ ప్రభుత్వం చూపిన చొరవ ఎవరూ కాదనలేనిది. ప్రస్తుతం తిరుపతి బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను కనీసం రెగ్యులర్‌గా మార్చలేకపోతున్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు కనీసం ఉప్పల్ బ్రిడ్జి మీద లింక్ కలపడం లేదు.

– పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ, కాంగ్రెస్

పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం



కరీంనగర్–హసన్‌పర్తి రైల్వేలైన్‌కు ఇటీవల గ్రీన్‌సిగ్నల్ ఇప్పించాం. ఇందుకోసం రూ.1.54 కోట్లు విడుదల చేయించాం. తీగలగుట్టపల్లి ఆర్వోబీకి సేతుబంధన్ పథకం కింద రూ.126 కోట్లు విడుదల చేయించాం. తిరుపతి రైలును రెగ్యులర్‌గా మార్చే విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం.

– బండి సంజయ్, ఎంపీ, బీజేపీ

రైల్వే రంగానికి పెద్దపీట



కరీంనగర్ ప్రజలకు రైల్వే సదుపాయం అందించేందుకు బీఆర్ఎస్ కృషి చేస్తోంది. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ పనులే ఇందుకు నిదర్శనం. తీగలగుట్టపల్లి ఆర్వోబీకి అనుమతులు తేవడంలోనూ మా పోరాటం ఉంది. తిరుపతి రైలును రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌పై కేంద్రం దృష్టి సారించాలి.

– వినోద్‌కుమార్, మాజీ ఎంపీ, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఉమ్మడి జిల్లాకు కేంద్రం నిధులు

- క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కింద రూ.250 కోట్ల సాయం
- నిధులను మౌలిక సదుపాయాలకు వినియోగం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాకు కేంద్రం నిధులు మంజూరయ్యాయి. స్కీం ఆఫ్ స్పెషల్ అసిస్టెన్స్ టూ ద స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ 2023–24 కింద ఈ నిధులు రానున్నాయి. ఈ పథకం కింద రాష్ట్రానికి మొత్తంగా రూ.2102 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో ఉమ్మడి జిల్లాకు రూ.250.5 కోట్ల సాయం అందనుంది. వీటిని మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా వివిధ శాఖల పరిధిలో ఉన్న భవనాలు, కాలేజీలు, గిడ్డంగులతోపాటు రోడ్లు, రైల్వే నెట్‌వర్క్ నిర్మాణానికి వినియోగించనున్నారు.

ఏ జిల్లాకు ఎలా..?

- కరీంనగర్‌లోని మొదటి సంవత్సరం విద్యార్థులకు వసతి కల్పించేందుకు విత్తన గిడ్డంగిని ఆధునీకరించేందుకు రూ.11 కోట్లు ఇవ్వనున్నారు.
- కరీంనగర్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.100 కోట్లు రానున్నాయి.
- కొత్తపల్లి –మనోహరాబాద్ రైల్వేలైన్ కోసం మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో వినియోగించుకునేందుకు రూ.100 కోట్లు వెచ్చించనున్నారు.
- ముస్తాబాద్– రాళ్లపేట వయా పోతుగల్, గన్నేరువరం, సేవాలాల్ తండా, ఓబులాపూర్ రహదారి బలోపేతం, విస్తరణకు రూ.27.50 కోట్లు ఖర్చు చేయనున్నారు.
- అంబర్‌పేట – చెగ్యాం వయా పైడిపల్లి, తాళ్లకొత్తపేట (వెల్గటూరు మండలం) ఎస్‌హెచ్–7 రహదారి విస్తరణకు రూ.12 కోట్లు వ్యయం చేయనున్నారు.

రేపే గ్రూప్–4 పరీక్ష

- 15 నిమిషాల ముందే గేట్లు మూసివేత
- పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు
- జిల్లాలో 43 పరీక్షాకేంద్రాలు
- కలెక్టర్ సంగీత వెల్లడి

పెద్దపల్లిరూరల్: జూలై ఒకటిన జిల్లాలో గ్రూప్–4 పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పావుగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, తర్వాత వచ్చే వారిని లోనికి అనుమతించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా 17,927మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ అయ్యాయని, వారికోసం 43 పరీక్షాకేంద్రాలను గుర్తించామని పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో వైద్యసేవలతోపాటు కేంద్రాలవద్ద పోలీస్ బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు.

ఆలయ భూమి ఆక్రమించిన ఎమ్మెల్యే దాసరి

- ప్రజాహిత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సత్యనారాయణరెడ్డి
- దేవాదాయ, ధర్మాదాయ శాఖ భూములు కాపాడాలని వినతి



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి, చిత్రంలో గంటా రాములు, ఎల్.రాజయ్య

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఆలయ భూమిని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆక్రమిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజాహిత వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీపీ సత్యనారాయణరెడ్డి ప్రశ్నించారు. జిల్లాకేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే దాసరి తన సొంతగ్రామమైన కాసులపల్లిలో దేవాదాయశాఖకు చెందిన 60 ఎకరాలు ఆయనతోపాటు ఆయన తండ్రి రాంరెడ్డి, సోదరులు రమణారెడ్డి, రఘునందన్‌రెడ్డి పేరిట కబ్జా చేశారని, ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలూ ఉన్నాయని తెలిపారు. కబ్జాచేసిన భూమిలో నిర్మించిన పాఠశాల భవనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో దేవాదాయ భూమిని తన అఫిడవిట్‌లో ఎమ్మెల్యే పేర్కొన్నారని, దీనిపై ఎన్నికల సంఘానికి ఆధారాలతో ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యుల ఆక్రమణలో ఉన్న దేవాదాయ భూమిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తే..పెద్దపల్లిలో తాను కొనుగోలు చేసిన భూమిలోని దేవాదాయశాఖ భూమిని తాను వదులుకుంటానని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మనోహర్‌రెడ్డి అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయిందని ఓదెల జెడ్పీటీసీ గంటరాములు ఆరోపించారు.

క్లుప్తంగా

ఏఎన్‌ఎం పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

• కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గిరిజన సంక్షేమ ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో ఏఎన్‌ఎంగా పని చేసేందుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు జూలై 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సంగీత సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. 18 నుంచి 44 ఏళ్లలోపు వయసున్న అభ్యర్థులు టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో 18 నెలల ఏఎన్‌ఎం శిక్షణలో ఉత్తీర్ణులై ఉండాలని లేదా అందుకు సమానమైన అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాల కోసం 96521 18867, 99854 44266 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఎన్టీపీసీ జ్యోతిక క్లబ్ సెక్రటరీ పదవికి ఇద్దరు పోటీ

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిక వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. సెక్రటరీ పదవికి ఇద్దరు రాజనర్సయ్య, వేముల కృష్ణయ్య పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు గురువారం ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్‌గా వి.రాములు, జాయింట్ సెక్రటరీగా ఆర్.సంపత్, కమిటీ సభ్యులుగా కందుల సత్తయ్య, ఆర్.సాంబయ్య, వి.అశోక్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీ పదవికి వచ్చే నెల 7న ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, ఐదు గంటల తర్వాత లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయని ముఖ్య ఎన్నికల అధికారి సుధాకర్ పంజాల, ఎన్నికల అధికారులు సమంత, ఎస్ఎస్.సుందరం తెలిపారు.

శాత్రాజ్‌పల్లిని జిల్లాలోనే కొనసాగించాలి

మంథని: ముత్తారం మండలంలోని శాత్రాజ్‌పల్లి గ్రామాన్ని పెద్దపల్లి జిల్లాలోనే కొనసాగించాలని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును కోరారు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలో చేర్చుతూ జారీ చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని, ఎప్పటిలాగే ముత్తారం మండలంలోనే కొనసాగిస్తూ జీవో విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. శాత్రాజ్‌పల్లి గ్రామం భౌగోళిక స్థితిగతులను బట్టి గ్రామస్తుల వ్యవసాయ భూములు, బ్యాంకు అకౌంట్స్, పెన్షన్లు ముత్తారంలోని వివిధ గ్రామాలతో అనుసంధానంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మానేరు నది మాత్రమే అడ్డుగా ఉందని, ఎలాంటి ఇబ్బందీ లేదని, ఓడెడు వంతెన ఉపయోగంగా ఉందని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో మరో నగ





కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రం, వ్యవసాయ కళాశాల కోసం మంత్రి నిరంజన్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి (ఫైల్)

- నాడు గీట్ల కృషితో వ్యవసాయ పరిశోధన కేంద్రం
- నేడు దాసరి కృషితో వ్యవసాయ కళాశాల
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండోది
- కూనారంలో కళాశాల ఏర్పాటుకు సీఎం అంగీకారం
- నాయకుల్లో ఉత్సాహం.. రైతుల్లో ఆనందం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మరో వ్యవసాయ కళాశాల ఏర్పాటు కానుంది. జగిత్యాల జిల్లా పొలాసలో వ్యవసాయ కళాశాల ఉండగా పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారంలో రెండో వ్యవసాయ కళాశాలకు సీఎం కేసీఆర్ అంగీకారం తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని కలిసి, కూనారంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీనికి మంత్రితోపాటు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. రైతు బిడ్డ, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దివంగత గీట్ల ముకుంద రెడ్డి చొరవతో కూనారంలో వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి రఘువీరారెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. నేడు అదే గ్రామంలో వ్యవసాయ కళాశాల కోసం ప్రస్తుత ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కృషి చేయడం పట్ల నియోజకవర్గ ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హైబ్రిడ్ వరి వంగడాలు

కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలు తయారు చేసిన హైబ్రిడ్ నూతన వరి వంగడాలు కూనారం సన్నాలు కేఎస్‌ఎం–118, కేఎస్‌ఎం–1638 అధిక దిగుబడితోపాటు తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఇవి మన రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల్లో ప్రత్యేకత సంతరించుకున్నాయి. అలాగే వ్యవసాయ కళాశాల ఏర్పాటైతే ఎందరో విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ప్రయోజనం



కూనారంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటైతే ఈ ప్రాంత రైతులకు, వారి బిడ్డలకు ప్రయోజనం కలుగుతుంది. కళాశాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి రైతుల పక్షాన కృతజ్ఞతలు.

– వంగళ తిరుపతి రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, కాల్వశ్రీరాంపూర్

ఇక్కడి ప్రజల అదృష్టం



గీట్ల ముకుంద రెడ్డి కూనారంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయిస్తే, దాసరి మనోహర్ రెడ్డి వ్యవసాయ కళాశాల మంజూరు చేయించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం. వారికి రుణపడి ఉంటాం.

– నూనేటి సంపత్‌యాదవ్, ఎంపీపీ, కాల్వశ్రీరాంపూర్

అన్నదాతలు బాగుండాలి



అన్నదాతలు బాగుంటేనే దేశం బాగుంటుంది. వారికి రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు జలాలు అందిస్తోంది. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూస్తోంది. వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు నావంతు కృషి చేశా.

– ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, పెద్దపల్లి

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- నగదు రికవరీ
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లాలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రంలోని షిమోగా జిల్లాలోని భద్రావతికి చెందిన శివుడు, అదే ఏరియాకు చెందిన కల్యాణ్, సందీప్, సూరి కర్ణాటకతోపాటు వికారాబాద్, సిరిసిల్లలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన కళ్లెం శ్రీనివాస్ బోర్‌వెల్ దుకాణం నడిపేవాడు. జూన్ 3న తన గ్రామం నుంచి కారులో వేములవాడకు వచ్చి బొమ్మల స్వామి నుంచి తీసుకున్న రూ.5లక్షల చెక్కును బ్యాంకులో వేసి డబ్బులు తీసుకున్నారు. ఆ నగదును కారు వెనుక సీటులో పెట్టుకొని వేములవాడలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో తన సోదరి ఇంట్లోకి వెళ్లాడు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులకొట్టి ఆ సొమ్మును ఎత్తుకెళ్లారు. దీనిపై వేములవాడ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో వేములవాడ సీఐ వెంకటేశ్, సీసీఎస్ ఎస్సై మారుతి ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు దొంగతనాలకు పాల్పడిన వారు కర్ణాటకకు చెందిన వారిగా తెలుసుకుని అక్కడికెళ్లి శివను అదుపులోకి తీసుకుని రూ.5 లక్షలు రికవరీ చేశారు. వేములవాడలో దొంగతనాలు చేసిన రూ.2.60 లక్షలు, అలాగే వేములవాడలో మే నెలలో దొంగతనం చేసిన రూ.40 వేలను రికవరీ చేశారు. బళ్లారి, రాయచోరీలతోపాటు హుజూర్‌నగర్, సూర్యాపేట, తాండూర్, వికారాబాద్‌లలో పలు దొంగతనాలు చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్, సీసీఎస్ కానిస్టేబుల్ అక్షర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అంతర్రాష్ట్ర దొంగల నుంచి రికవరీ చేసిన డబ్బు. వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఏఐటీయూసీపై ఆరోపణలు మానుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కార్మికుల్లో తమ ఉనికిని కోల్పోతామన్న భయంతో హెచ్‌ఎంఎస్ నాయకులు ఏఐటీయూసీపై అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు ఎల్.ప్రకాశ్, బ్రాంచి కార్యదర్శి రాజరత్నం అన్నారు. వాటిని వెంటనే మానుకోవాలన్నారు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈపీ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని కార్పొరేట్ స్థాయిలో పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. కానీ ఈ విషయంలో సింగరేణి యాజమాన్యం నాలుగేళ్లుగా నిర్లక్ష్యం చేస్తోందని, ఏవో కుంటిసాకులు చెబుతూ ఈ నెల 28న నిర్వహించాల్సిన కౌన్సెలింగ్ వాయిదా వేసిందని ఆరోపించారు. పైరవీకారులకు వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. కౌన్సెలింగ్ వాయిదా వేయడంలో ఏఐటీయూసీ పాత్ర ఉందని హెచ్‌ఎంఎస్ నాయకులు అనడం సరికాదన్నారు. ఇది నిరూపించకపోతే కార్మిక క్షేత్రంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు అన్నారావు, బుర్ర తిరుపతి, శ్యాంసన్, సాంబశివరావు, రాజు, సాగర్, సంపత్, శంకర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మంథని: ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన బోనగాని శంకరయ్య అనే గీత కార్మికుడు గురువారం కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని వెన్ను, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి, ముత్తారంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు కరీంనగర్ తీసుకెళ్లారు.

‘బీసీ బంధు’ అర్హులకు అందేనా?

- జిల్లాలో దరఖాస్తు చేసినవారు 10,759 మంది
- క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్న అధికారులు

సుల్తానాబాద్/ ఎలిగేడు(పెద్దపల్లి): బలహీన వర్గాలకు చెందిన కులవృత్తిదారులకు ప్రభుత్వం అందించనున్న రూ.లక్ష ఆర్థికసాయం(బీసీ బంధు) పథకానికి దరఖాస్తులు వేలాదిగా వచ్చాయి. అర్జీల సమర్పణకు ఈ నెల 20న గడువు ముగియడంతో అధికారులు వాటిని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాలకు పంపించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. జిల్లా స్థాయి కమిటీ పరిశీలించిన తర్వాత పది రోజుల్లోపు జాబితా సిద్ధం చేసి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కార్యాలయంలో అందజేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

జిల్లాలో 266 గ్రామాలు..

పెద్దపల్లి జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, మున్సిపాలిటీలతోపాటు రామగుండం కార్పొరేషన్ ఉన్నాయి. సుమారు 6 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. బీసీ బంధు పథకానికి 10,759 మంది దరఖాస్తు చేసుకున్నారు.



ఎలిగేడులో విచారణ జరుపుతున్న అధికారులు

మొదట పేదవారికి ప్రాధాన్యం

వచ్చిన దరఖాస్తుల్లో మొదట పేదవారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాత వితంతువులు, దివ్యాంగులకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ విషయమై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు. చాలామంది వృత్తులకు అతీతంగా దరఖాస్తు చేశారు. ఇప్పుడు వాటిని తొలగించే ప్రక్రియ చేపడుతున్నారు. ఇదివరకు రూ.50 వేల రాయితీ రుణం కోసం అర్జీ పెట్టుకొని, ఉంటే తిరస్కరిస్తున్నారు. ఇప్పటికీ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ లాగిన్ ఇవ్వలేదు.

అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు

జిల్లాలోని 14 ఎంపీడీవో కార్యాలయాల పరిధిలో ఉన్న అధికార పార్టీ నేతల చుట్టూ దరఖాస్తుదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు రూ.లక్ష సాయం అందించేలా చూడాలని వేడుకుంటున్నారు.

చేతివృత్తుల వారికి ప్రాధాన్యం ఇవ్వాలి



చేతివృత్తుల ద్వారా జీవనోపాధి పొందే వారికి రూ.లక్ష ఆర్థికసాయంలో ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు పైరవీలను ప్రోత్సహించవద్దు. అర్హులకు అన్యాయం చేయవద్దు.

– నూర శ్యాం, విద్యార్థి జేఏసీ జిల్లా కో–కన్వీనర్

అర్హులను ఎంపిక చేయాలి



గ్రామాల్లో, పట్టణాలలో పార్టీలకతీతంగా అర్హులను ఎంపిక చేయాలి. చేతివృత్తుల వారికి రూ.లక్ష సాయం అందించాలి. ఇది వారి జీవనోపాధికి మేలు చేస్తుంది. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలి.

– ఎస్పీ రాజయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి

బొగ్గుబాయి వార్తలు

ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోండి

- వానాకాలం బొగ్గు ఉత్పత్తిపై సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): వానాకాలంలో బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్ సూచించారు. గురువారం ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓబీ తొలగింపు, వర్షాలతో క్వారీలో నీటి నిల్వలు పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. నీటి ప్రవాహాన్ని బయటకు పంపించడం, వరద కాలువల పునరుద్ధరణ చేపట్టాలన్నారు. బొగ్గు రవాణా చేసేందుకు నిల్వ సామర్థ్యం పెంచుకోవడం, బొగ్గు అవసరాలను దృష్టిలో పెట్టుకొని, రాబోయే రోజుల్లో వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, ప్రాజెక్టు ఇంజినీర్ దుర్గాప్రసాద్, సర్వే అధికారి నర్సింగరావు, డెప్యూటీ మేనేజర్ క్వాలిటీ వెంకటమోహన్, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ తదితరులున్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్

రక్షణ తర్వాతే ఉత్పత్తిపై దృష్టిసారించాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): రక్షణ చర్యలు చేపట్టిన తర్వాతే గనిలో బొగ్గు ఉత్పత్తిపై దృష్టిసారించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. గురువారం ఏరియాలోని జీడీకే–11 గనిని సందర్శించి, రక్షణ చర్యలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనునిత్యం విధుల్లో రక్షణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గనికి సంబంధించిన అన్ని సీమ్‌ల మ్యాప్‌లను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కంటిన్యూస్ మైనర్ యంత్రం నడిచే ప్రదేశాన్ని మ్యాప్ ద్వారా పరిశీలించి, పలు సలహాలు అందించారు. అనంతరం గనిలోకి దిగి, 3వ సీమ్ రెండో కంటిన్యూస్ మైనర్ డిస్ట్రిక్ట్‌లో ఉత్పత్తిని చూశారు. బొగ్గు ఉత్పత్తి సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. జీఎం వెంట ఏజెంట్ చిలక శ్రీనివాస్, మేనేజర్ నెహ్రూ, రక్షణ అధికారి మల్లేశం, డీవైఎస్ఎస్‌వో హనుమాండ్లు తదితరులున్నారు.



గనిలోకి వెళ్తున్న జీఎం శ్రీనివాస్

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్

గోదావరిఖని(రామగుండం): తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. కేంద్ర కోల్‌మినిస్ట్రీ ఆదేశాల మేరకు తడి, పొడి చెత్త డబ్బాలను గురువారం తన కార్యాలయ ఆవరణలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొడి చెత్తలో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు పెంకులు, చెడిపోయిన ఎలక్ట్రానిక్ విడిభాగాలు మొదలైనవి రీసైక్లింగ్‌కు పంపించే అవకాశం ఉంటుందన్నారు. తడి చెత్తను ఎరువుగా మార్చి, వినియోగించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ, ఎస్టేట్ అధికారి జె.సునీత, పర్యావరణ అధికారి సురేష్‌బాబు, పర్చేజ్ ఎస్ఈ చంద్రంరాజు తదితరులు పాల్గొన్నారు.



చెత్త డబ్బాలు అందిస్తున్న జీఎం మనోహర్

వకీల్‌పల్లి గనిపై స్వచ్ఛ పక్వాడా

ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గనిపై గురువారం స్వచ్ఛ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గని ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించి, శుభ్రం చేశారు. గని మేనేజర్ రవికిరణ్, రాంకుమార్, సంక్షేమాధికారి ఓంకారి బాబు, పిట్ ఇంజినీర్ జలపతి, పిట్ సెక్రటరీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి



మొక్కలు నాటుతున్న జీఎం సుధాకర్‌రావు

- ఆర్జీ–3 జీఎం కె.సుధాకర్‌రావు

కమాన్‌పూర్(రామగిరి): సింగరేణి అధికారులు, కార్మికులు, వారి కుటుంబసభ్యులు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి, సంరక్షించాలని ఆర్జీ–3 జీఎం కె.సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. స్వచ్ఛ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఆర్జీ–3 ఏరియా సెంటనరీకాలనీ రాణీ రుద్రమదేవి క్రీడామైదానంలో గురువారం అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సీఎండీ శ్రీధర్ ఆదేశాల మేరకు మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఎనిమిది విడతల్లో జరిగిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో 5,600 హెక్టార్లలో 5 కోట్లకు పైగా మొక్కలు నాటి, పరిసర ప్రాంతాల ప్రజలు మొక్కలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో 56 హెక్టార్లలో 10 లక్షల మొక్కలు నాటి, పచ్చదనాన్ని పెంపొందిస్తున్నామని అన్నారు. 70 రకాల ఔషధ మొక్కల పెంచుతున్నట్లు చెప్పారు. అధికారులు సెంటనరీకాలనీలోని టీటూ క్వార్టర్స్ పరిసరాల్లో చెత్త తొలగించారు. అధికారులు బైద్య, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, వెంకటరమణ, చంద్రశేఖర్, విలాస్ శ్రీనివాస్ పోద్దార్, కర్ణ, పద్మరాజు, సుధాకర్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, రాజేశ్వరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను ప్రభుత్వమే చెల్లించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికుల ఆదాయ పన్ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1 సైట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులు సుదీర్ఘ సమ్మె చేసి, తెలంగాణ సాధనలో భాగస్వాములయ్యారని తెలిపారు. పన్నుల రూపేనా సింగరేణి వేల కోట్ల రూపాయలను సర్కారుకు చెల్లిస్తోందని చెప్పారు. రాష్ట్రానికి ఆర్థిక వనరులు సమకూరుస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వమే ఆదాయ పన్ను చెల్లించాలన్నారు. వారి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రతీ కార్మికునికి 2 గుంటల భూమి, రూ.50 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని కోరారు. మారుపేర్ల మార్పిడికి ఎన్నికల ముందు హామీ ఇచ్చినప్పటికీ అమలు కాలేదన్నారు. నాయకులు వేణుగోపాల్‌రావు, రవీందర్, ప్రసాద్, స్వామి, తిప్పర్తి రాజమహేందర్‌రెడ్డి, శ్యాంసుందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

ప్రైవేటు బడిలో పుస్తకాల గదులు సీజ్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నారని ఏబీవీపీ నాయకులు రామగుండం ఎంఈవో సంపత్‌రావుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో గురువారం పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న గదులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతి లేకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థికభారం మోపుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఆర్పీలు వెంకటేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



సీజ్ చేసిన గదిని పరిశీలిస్తున్న నాయకులు